సాక్షి వనపర్తి
శనివారం : 25 : జనవరి : 2025



ఆపద్బాంధవా.. ఆంజనేయ

ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఉత్సవాలు శనివారం ప్రారంభం కానున్నాయి.

వివరాలు 10లో ▸



పాలిటెక్నిక్ క్రీడలు

ఉమ్మడి జిల్లాస్థాయి పాలిటెక్నిక్ క్రీడా పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
35.7 /14.6

వాతావరణం

రాత్రి తీవ్రత రోజురోజుకు తగ్గుతుంది. ఉదయం వేళ మంచు కురుస్తుంది. అప్పుడప్పుడు చల్లటి గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రాష్ట్రపతి అవార్డుకు ఆరేపల్లి వాసి ఎంపిక



ఏటికాడి ఆనంద్

ఆత్మకూర్: మండలంలోని ఆరేపల్లికి చెందిన మత్స్యకారుడు ఏటికాడి ఆనంద్ రాష్ట్రపతి అవార్డుకు ఎంపికయ్యారని మత్స్యశాఖ ఉన్నతాధికారులు శుక్రవారం ప్రకటించారు. ఆనంద్ ఆరేపల్లిలో పదేళ్లుగా నాణ్యమైన చేప పిల్లలను ఉత్పత్తి చేస్తూ రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు రాయితీపై ప్రభుత్వం ద్వారా పంపిణీ చేస్తున్నారు. గణతంత్ర దినోత్సవం రోజున ఢిల్లీలో రాష్ట్రపతి ముర్మూ చేతుల మీదుగా ఉత్తమ మత్స్యకారుడిగా, చేపపిల్లల ఉత్పత్తిదారుగా, పంపిణీదారుడిగా అవార్డు అందుకోనున్నారు.

రామన్‌పాడులో పూర్తిస్థాయి నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగులు ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ కాల్వ నుంచి 640 క్యూసెక్కుల వరద కొనసాగుతుండగా.. సమాంతర కాల్వ ద్వారా నీటి సరఫరా నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వకు 415 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వకు 35, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని వివరించారు.

వేరుశనగకు గిట్టుబాటు ధర కల్పించాలి



వనపర్తి రూరల్: రైతులు పండించిన వేరుశనగకు గిట్టుబాటు ధర కల్పించాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి పరమేశ్వరాచారి కోరారు. శుక్రవారం మండలంలోని చిట్యాల శివారు వ్యవసాయ మార్కెట్‌యార్డులో రైతులతో కలిసి వేరుశనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు పెట్టుబడి కోసం ప్రైవేట్ వ్యాపారులతో అప్పులు తెచ్చారని.. తీరా పంట చేతికొచ్చి విక్రయించే సమయంలో గిట్టుబాటు ధరలు లభించక నష్టపోతున్నారని వివరించారు. ప్రభుత్వం క్వింటాకు రూ.10 వేల మద్దతు ధర కల్పించాలన్నారు. కార్యక్రమంలో రైతులు నారాయణ, శ్రీనివాసులు, వెంకటయ్య, కురుమూర్తి, మన్యం, రాములు పాల్గొన్నారు.

పాలెం వెంకన్న హుండీ లెక్కింపు

బిజినేపల్లి: మండలంలోని పాలెం శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో హుండీని శుక్రవారం లెక్కించారు. నాలుగు నెలలకు గాను హుండీ ఆదాయం రూ.2,95,970 వచ్చినట్లు ఆలయ కమిటీ తెలిపింది. జిల్లా దేవాదాయ పర్యవేక్షకులు వెంకటేశ్వరి ఆధ్వర్యంలో హుండీని లెక్కింపు చేపట్టగా.. కురవి రామానుజాచార్యులు, జయంత్‌శుక్ల, అరవింద్, చక్రపాణి, మాజీ ధర్మకర్తలు సురేందర్ పాల్గొన్నారు.

‘సైబర్’ వల?

నిరుద్యోగ యువతను ట్రాప్ చేసి ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న నేరగాళ్లు

- జిల్లాలో నమోదైన కేసులో రోజురోజుకు పెరుగుతున్న నిందితుల సంఖ్య
- ఇప్పటికే 14 మంది రిమాండ్‌కు..
- తవ్వే కొద్ది కొత్త విషయాలు వెలుగులోకి..



వనపర్తి: అక్రమ మార్గంలో ఈజీ మనీకి అలవాటు పడిన సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు తమ పంథా మారుస్తూ అమాయకులకు వల వేస్తూ ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారు. ఇంతవరకు లక్కీలాటరీ, బంపర్ ఆఫర్, మనీ ప్రైస్‌లను ఎరజూపి సైబర్ నేరాలకు పాల్పడ్డారు. ఈ విషయంపై పోలీసులు, బ్యాంకర్లు ప్రజలను చైతన్యం చేయడంతో కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. బ్యాంకుల్లో రుణాల కోసం ప్రయత్నిస్తున్న వారి జాబితాను అనధికారికంగా సేకరించి ఆయా ప్రాంతాల్లోని ముందస్తుగా డబ్బు ఎరజూపిన యువతతో ఫోన్లు చేయించి ధని, ముద్ర పథకాల్లో ఇప్పిస్తామంటూ ప్రాసెసింగ్ ఫీజు, ఇన్సూరెన్స్ అంటూ ముందస్తుగా డబ్బులు దండుకొని మోసం చేస్తున్నారు. ఇలాంటి కేసులు తెలుగు రాష్ట్రాల్లో వెయ్యికి పైగా నమోదైనట్లు తాజాగా రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షిఖా గోయల్ వెల్లడించిన విషయం విధితమే. కోల్‌కత్తా, ముంబై, పాట్నా తదితర ప్రాంతాల సైబర్ నేరగాళ్లు జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాలు, తండాల యువతకు డబ్బు ఎరజూపి ట్రాప్ చేస్తున్నట్లు ఇటీవల మూడుసార్లు నేరాలకు పాల్పడిన 14 మంది యువకులను కోర్టుల్లో హాజరుపరుస్తున్న సమయంలో పోలీసులు వెల్లడించారు. గతేడాది డిసెంబర్‌లో జిల్లాకేంద్రానికి చెందిన బైక్ మెకానిక్ రుణానికి ప్రయత్నించి మోసపోయి చేసిన ఫిర్యాదు మేరకు జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులు చేపట్టిన విచారణలో తవ్వే కొద్ది నిందితుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఇప్పటికే 14 మందిని అరెస్టు చేసి రిమాండ్ తరలించగా.. మరో 150 మందికి పైగా యువకులు ఈ ప్రాంతంలో సైబర్ నేరాలకు పాల్పడుతున్న వారికి సహకరిస్తున్నట్లు పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఈ నెల 21న అరెస్టు చేసిన వారి నుంచి ఓ కారు, పాక్లెయిన్, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. డిసెంబర్‌లో నమోదైన ఈ కేసులో పోలీసులకు లభించిన లింకు ద్వారా అతిపెద్ద సైబర్ నేరస్తుల గొలుసుకట్టు వెలుగు చూస్తోంది.

నిరుద్యోగులే టార్గెట్..

జల్సాలకు అలవాటు పడిన నిరుద్యోగ యువతను ఎంపిక చేసుకొని వారికి విలాసవంతమైన జీవనాన్ని అలవాటు చేసి సైబర్ నేరాల రొంపిలోకి లాగుతున్నట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. కోల్‌కత్తా, ఢిల్లీ, పాట్నా తదితర ప్రాంతాల నుంచి వచ్చే వివరాల మేరకు రుణాల కోసం ప్రయత్నిస్తున్న వారితో ఫోన్లో మాట్లాడి లోన్ ఇప్పిస్తామంటూ మోసాలకు పాల్పడుతున్నారు. లోన్ కోసం ప్రయత్నిస్తున్న వారితో స్థానికులతోనే మాట్లాడిస్తే సులభంగా నమ్మి ఫీజుల కోసం డబ్బులు పంపిస్తారనే ఉద్దేశంతో స్థానిక యువతను టార్గెట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రధాన సైబర్ నేరగాళ్ల భాషను ఇక్కడి వారు సులభంగా గుర్తించి నమ్మరనే ఈ పన్నాగానికి పూనుకున్నట్లు తెలుస్తోంది.

సైబర్ ఉచ్చులో పడొద్దు..



డబ్బు ఎరజూపి జల్సాలకు అలవాటు చేస్తూ సైబర్ నేరాలకు పాల్పడేలా చేస్తున్న ఇతర ప్రాంతాల వారి మాటలు నమ్మి ఉచ్చులో పడొద్దు. కొత్తవారు డబ్బు ఎరజూపిస్తే టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయండి. ఈజీ మనీకి ఆశపడితే జీవితాలు నాశనం అవుతాయని గమనించాలి. ఇతరులను మోసం చేసి సంపాదించే డబ్బుపై యువత ఆశ పడొద్దు.

– రత్నం, డీఎస్పీ సైబర్ క్రైమ్ విభాగం, వనపర్తి

పోలీసులకు చిక్కిన సైబర్ తిమింగలం..

పెద్దమందడి మండలం ఓ తండాకు చెందిన భారీ సైబర్ తిమింగలాన్ని పోలీసులు అరెస్టు చేశారు. ఇతను సమీప ప్రాంతాల్లోని చాలామంది నిరుద్యోగ యువతను సైబర్ ఉచ్చులోకి లాగినట్లు తెలుస్తోంది. ఇతడి నుంచి భారీ మొత్తంలో ఆస్తులు, నగదు రికవరీ చేసినట్లు సమాచారం.

రూ.65 లక్షల బిట్‌కాయిన్ స్వాహా..

ఈ నెల 14న కొత్తకోటకు చెందిన ఓ వ్యక్తి సమాచారాన్ని ఇన్‌స్టాగామ్‌లో తెలుసుకొని ఎర్న్‌డ్ పాయింట్స్ యాడ్ చేస్తామంటూ సైబర్ నేరగాళ్లు ఫోన్‌చేసి రూ.65 లక్షల బిట్‌కాయిన్‌ను స్వాహా చేశారు. పోలీసులు చేసిన ఓ అధ్యయనంలో కొన్నేళ్లుగా మోసపోతున్న వారిలో 90 శాతం చదువుకున్నవారే ఉండటం గమనార్హం.

క్షయ నియంత్రణలో భాగస్వాములవ్వాలి



ఉగాండా, జనీవా బృందంతో డీఎంహెచ్ఓ డా. శ్రీనివాసులు, వైద్యాధికారులు

అమరచింత: క్షయ నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డీఎంహెచ్ఓ డా. శ్రీనివాసులు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో తిపుడంపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో క్షయ శిబిరం నిర్వహించగా ఉగాండా, జెనీవాకు చెందిన గ్లోబల్‌ఫండ్ ఆర్గనైజేషన్ బృందం సందర్శించింది. వారికి డీఎంహెచ్ఓ అందుతున్న అందుతున్న వైద్య సేవల గురించి వివరించారు. నిరంతరం గ్రామాల్లో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామని, వ్యాధిగ్రస్తుల వివరాలు గోప్యంగా ఉంచడంతో పాటు నివారణ మాత్రలు, ఆరునెలల పాటు న్యూట్రీషన్ ఫుడ్ అందిస్తున్నామని వివరించారు. శిబిరంలో అత్యాధునిక పరికరాలతో వంద మందిని పరీక్షించగా 9 మందికి క్షయ సోకినట్లు నిర్ధారణ కాగా.. మందులు పంపిణీ చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విధిగా మాస్క్ ధరించాలని, కుటుంబ సభ్యులతో కలిసిమెలసి ఉంటున్నా.. ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డా. సాయినాథ్‌రెడ్డి, డా. పరిమళ, డా. రుపాశ్రీ, తిపుడంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డా. నందకిశోర్, డా. నిఖిత, సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్, సీహెచ్ఓ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిజన్ కార్మికుల దీక్ష విరమణ



వనపర్తి రూరల్: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని విద్యుత్ సర్కిల్ కార్యాలయం ఎదుట విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ టీవీఏసీ జేఏసీ నాయకులు ఐదురోజులుగా చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం ముగిశాయి. వారికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టిజన్ కార్మికులను క్రమబద్ధీకరిస్తామని చెప్పి మోసం చేసిందని ఆరోపించారు. శాశ్వత ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న ఆర్టిజన్స్‌ను విద్యార్హతల ఆధారంగా కన్వర్షన్ చేయాలని ప్రస్తుత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆనంద్‌గౌడ్, ఎండీ ఫారూఖ్, రామకృష్ణ, బాలరాజు, ఎండీ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణతంత్ర వేడుకల నిర్వహణ



గణతంత్ర వేడుకల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి.. చిత్రంలో అదనపు కలెక్టర్, డీఎస్పీ

కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల క్రీడా ప్రాంగణంలో గణతంత్ర వేడుకల నిర్వహణ ఏర్పాట్లను అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, జి.వెంకటేశ్వర్లు, డీఎస్పీ వెంకటేశ్వర్‌రావుతో కలిసి పరిశీలించారు. కార్యక్రమాలను తిలకించేందుకు వచ్చే అతిథులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలకు కూర్చోడానికి తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. తాత్కాలిక వైద్య శిబిరం, తాగునీరు, మౌలిక వసతులు సమకూర్చాలని కోరారు. వేదిక ఏర్పాటులో జాగ్రత్తలు తీసుకోవాలని, స్వాతంత్ర్య సమరయోధుల సన్మానం, పోలీస్ కవాతు, శకటాల ప్రదర్శన, జిల్లా అభివృద్ధి కార్యక్రమాలపై స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ పక్కాగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ సుబ్రమణ్యం, ఏఓ భానుప్రకాష్, తహసీల్దార్ రమేశ్‌రెడ్డి, పుర కమిషనర్ పూర్ణచందర్ తదితరులు ఉన్నారు.

బాలికల అభ్యున్నతితో దేశాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి రజని

అమరచింత: బాలికల అభ్యున్నతితో దేశాభివృద్ధి సాధ్యమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి వి.రజని అన్నారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని దేశాయి మురళీధర్‌రెడ్డి మెమోరియల్ ప్రాథమిక పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో బాలురతో పాటు బాలికలను సమానంగా చూస్తూ అవకాశాలు కల్పిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. బాలికలు అన్నిరంగాల్లో రాణించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తోడ్పాటునందించాలని కోరారు. వారికి అవసరమైన వనరులు, వసతులు కల్పిస్తే అవకాశాలను అందిపుచ్చుకొని సమాజ శ్రేయస్సులో భాగస్వాములయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. బాలికల కోసం ప్రభుత్వాలు అనేక చట్టాలు తీసుకొస్తున్నాయని, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గణతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీలను ఆమె ప్రారంభించారు. భవిత కేంద్రంలో విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో లీగల్ కౌన్సిల్ డి.కృష్ణయ్య, ఎంఈఓ భాస్కర్‌సింగ్, ప్రధానోపాధ్యాయురాలు కళావతమ్మ, కరుణాకర్, పారా లీగల్ వలంటీర్లు అహ్మద్, రాజేంద్రకుమార్, కలంపాషా, భవిత కేంద్రం నిర్వాహకురాలు స్వప్న, లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి నిబంధనలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి: ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలపై అవగాహన కలిగి ఉండటమే కాకుండా వాటిని విధిగా పాటించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రోడ్డు భద్రతపై ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. మండలస్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్, బూట్లు ధరించాలని సూచించారు. వీపనగండ్ల విద్యార్థుల బృందం ప్రథమ స్థానం, మదనాపురం, కొత్తకోట మండలాల విద్యార్థుల బృందాలు ద్వితీయ స్థానాల్లో నిలవగా వారిని అభినందించారు. విజేత జట్లకు త్వరలోనే బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండోరోజూ న్యాక్ బృందం పర్యటన



సింథటిక్ ట్రాక్‌ను పరిశీలిస్తున్న న్యాక్ కమిటీ చైర్మన్ రామశంకర్ దుబే తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్/ గద్వాల టౌన్/ కొల్లాపూర్: పాలమూరు యూనివర్సిటీలో న్యాక్ పీర్ టీం రెండోరోజూ పర్యటన కొనసాగింది. ఈ మేరకు ప్రధానంగా ఫార్మసీ ఆడిటోరియంలో యూనివర్సిటీలో పనిచేస్తున్న నాన్‌టీచింగ్ సిబ్బంది సమస్యలను కమిటీ చైర్మన్ రామశంకర్ దుబే అడిగి తెలుసుకున్నారు. ఏ ప్రతిపాదికన పనిచేస్తున్నారు.. వేతనాలు ఎలా ఉన్నాయి.. ఈఎస్ఐ, పీఎఫ్ వంటివి ఉన్నాయా అని ఆరాతీశారు. అలాగే పీయూ అల్యూమిన్ (పూర్వ విద్యార్థులతో) కూడా న్యాక్ కమిటీ సమావేశమైంది. విద్యార్థులకు అందిస్తున్న కోర్సులు, చదువులు పూర్తయ్యాక క్యాంపస్ సెలక్షన్స్, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై చర్చించినట్లు సమాచారం. పలు పరిశోధన పత్రాలను పరిశీలించారు. అంతేకాకుండా కొల్లాపూర్, గద్వాల పీజీ సెంటర్లను జయశ్రీ నాయర్, అన్న స్వామినారాయణమూర్తి సందర్శించి పలు అంశాలపై ఆరాతీశారు.

క్యారమ్స్ ఆడిన కమిటీ సభ్యులు..

తనిఖీల్లో భాగంగా న్యాక్ బృందం పీయూ స్పోర్ట్స్ కాంప్లెక్సును సందర్శించారు. ఈ సందర్భంగా క్యారమ్స్ బోర్డు గదిలో అధికారులు సరదాగా క్యారమ్స్ ఆడారు. న్యాక్ కమిటీ చైర్మన్ రామశంకర్ దుబే, సభ్యులు కేకే అగర్వాల్ ఒక జట్టు, పీయూ వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ చెన్నప్ప మరో జట్టుగా క్యారమ్స్ ఆడారు. అక్కడ ప్రతి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన ఇంటర్ యూనివర్సిటీ, సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ స్పోర్ట్స్ వివరాలు, విద్యార్థులకు యూనివర్సిటీలో స్పోర్ట్స్ ఆడేందుకు అందిస్తున్న అవకాశాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇటీవల నిర్మించిన సింథటిక్ ట్రాక్, ఏర్పాటు చేయబోయే ఫుట్‌బాల్ గ్రౌండ్, అథ్లెటిక్స్ వివరాలు తెలుసుకున్నారు. ఇటీవల నిర్మించిన బాస్కెట్‌బాల్ కోర్టును సందర్శించారు. శనివారం సాయంత్రంతో న్యాక్ పీర్ కమిటీ మూడు రోజుల సందర్శన ముగియనుంది. సాయంత్రం పీర్ కమిటీకి వీడ్కోలు కార్యక్రమాన్ని పీయూ అధికారులు ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.

రసాభాసగా పుర కౌన్సిల్ సమావేశం



గొడవ పడుతున్న అధికార, విపక్ష కౌన్సిలర్లు

- బోరుబావులు, ఫర్నీచర్ కొనుగోలు, రోడ్ల విస్తరణపై గళమెత్తిన బీఆర్ఎస్ సభ్యులు
- సభలో తీవ్ర వాగ్వాదం.. పరస్పర ధూషణలు

వనపర్తి టౌన్: జిల్లాకేంద్ర పుర కౌన్సిల్ చివరి సమావేశం అధికార, ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్ల వాగ్వాదాలు, పరస్పర ఆరోపణలు, వ్యక్తిగత ధూషణలతో రసాభాసగా మారింది. శుక్రవారం పుర కార్యాలయంలో చైర్మన్ మహేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ సభ్యుడు గట్టుయాదవ్, వాకిటి శ్రీధర్, బండారి కృష్ణ, లక్ష్మీనారాయణ, నాగన్నయాదవ్ తదితరులు మాట్లాడుతూ.. పురపాలికలో తాగునీరు పుష్కలంగా ఉన్నా బోరుబావులు, మోటార్ల పేరుతో రూ.కోటి దుర్వినియోగానికి పాల్పడుతున్నారని, పలు వార్డుల్లో అవసరం లేకున్నా రెండు, మూడు చోట్ల బోర్లు వేస్తున్నారని, ఎమ్మెల్యే నిధులతో బోర్లు వేయిస్తామని గతంలో చెప్పి ప్రస్తుతం పుర నిధులు ఎలా వాడుతారని ప్రశ్నించారు. గతంలో కార్యాలయ ఫర్నీచర్ కొనుగోలుకు నిధుల కోసం ఆమోదించినా తిరిగి ఎజెండాలో పొందుపర్చడం ఏమిటని ప్రశ్నించారు. ఏడాది గడువు ముగిసినా రోడ్ల విస్తరణలో మిగిలిన 20 శాతం పనులు పూర్తి చేయడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. ఒక్కో వార్డు అభివృద్ధికి రూ.5 లక్షల జనరల్ నిధులు కేటాయిస్తామని చెప్పి కాంగ్రెస్ కౌన్సిలర్ల వార్డులకు 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించడం అనైతికమన్నారు. దీంతో చైర్మన్ మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, వెంకటేష్, విభూది నారాయణ, చీర్ల సత్యం తదితరులు కల్పించుకోవడంతో సభ పరస్పర, వ్యక్తిగత ధూషణల వరకు వెళ్లింది. 10 నెలల కిందట చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు రాజీనామా చేసిన గట్టుయాదవ్, వాకిటి శ్రీధర్ చివరి సమావేశానికిఖకౌన్సిలర్ హోదాలో రావడంతో పాటు ఎజెండాలోని అంశాలను లేవనెత్తడంతో ఆద్యంతం సభ వాడీవేడిగా కొనసాగింది. ఓ దశలో సభ్యులు ఎవరు ఏం మాట్లాడుతున్నారో అర్థంగాని పరిస్థితి నెలకొంది. చివరి సమావేశం కావడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రాజకీయలకు డెడ్‌లైన్ లేదు : ఎమ్మెల్యే

పదవులున్నా.. లేకున్నా ప్రజలకు సేవ చేసే సంకల్పం ఉండాలని, రాజకీయాలకు డెడ్‌లైన్ ఉండదని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. పుర చివరి కౌన్సిల్ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని తెలిపారు. పురపాలికను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసుకుందామని.. అన్నివేళలా సహకారం అందిస్తానన్నారు. పదవీ కాలం పూర్తయిన సందర్భంగా అధికార, విపక్ష కౌన్సిలర్లకు అధికారులు పూలమాలలు వేసి జ్ఞాపికలు అందించి శాలువాలతో సత్కరించారు.

ముగిసిన గ్రామ, వార్డు సభలు

వనపర్తి: గణతంత్ర దినోత్సవం రోజున రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న నాలుగు సంక్షేమ పథకాల అమలుకు లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహించిన గ్రామ, వార్డు సభలు శుక్రవారం ముగిశాయి. నాలుగు రోజుల్లో జిల్లావ్యాప్తంగా 255 గ్రామపంచాయతీలు, ఐదు పురపాలికల్లోని 348 వార్డుల్లో సభలు జరిగాయి. ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, రైతుభరోసా నాలుగు పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం సభలు నిర్వహించిన విషయం విధితమే. లబ్ధిదారుల జాబితాపై శనివారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహ ఆమోద ముద్ర వేయనున్నారు.

చివరిరోజు ఇలా..

నాలుగో రోజు శుక్రవారం జిల్లావ్యాప్తంగా 16 గ్రామ, వార్డు సభలు జరగగా.. ఇందిరమ్మ ఇళ్లకు 3,015 మందిని అర్హులుగా గుర్తించారు. అదనంగా మరో 883 దరఖాస్తులు వచ్చాయి. ఆత్మీయ భరోసా పథకానికి 361 కుటుంబాలను అర్హులుగా గుర్తించగా 52 అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. కొత్తగా మరో 20 అర్జీలు దాఖలయ్యాయి. కొత్త రేషన్ కార్డుల జారీకి 1,245 కుటుంబాలను అర్హులుగా గుర్తించారు. పదింటిపై అభ్యంతరాలు వ్యక్తమవగా.. 1,235 ఎంపికయ్యాయి. మరో 1,478 అర్జీలు దాఖలయ్యాయి. రైతుభరోసా పథకానికి 300 మందిని అర్హులుగా జాబితాను సిద్ధం చేసి గ్రామ, వార్డుసభల్లో అధికారులు చదివి వినిపించగా.. 10 అభ్యంతరాలు వచ్చాయి. మరో 8 అర్జీలు దాఖలయ్యాయి.

ప్రతి ఎకరాకు సాగు నీరు..



పెద్దగూడెంతండా గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి రూరల్: ఖాన్ చెరువు కాల్వను త్వరలోనే పూర్తిచేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని పెద్దగూడెంతండాలో జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన పథకాల్లో పేర్లు లేనివారు దరఖాస్తు చేసుకోవాలని, అర్హులందరికీ లబ్ధి చేకూరుస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు రవికిరణ్, మాజీ ఎంపీపీ శంకర్‌నాయక్, నాయకులు వాల్యానాయక్, ధర్మానాయక్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు రోజుల్లో పథకాల వారీగా వివరాలిలా..

పథకం	లబ్ధిదారులు	అభ్యంతరాలు	ఆమోదం	కొత్త దరఖాస్తులు
ఇందిరమ్మ ఇళ్లు	59,839	288	57,557	10,708
రైతు భరోసా	44,277	1,280	44,655	343
రేషన్ కార్డులు	29,633	609	22,877	17,650
ఇందిరమ్మ ఆత్మీయ భరోసా	10,048	1825	7,986	3,225

క్లుప్తంగా

చికిత్స పొందుతూ బీఆర్‌ఎస్‌ నేత మృతి


నిరంజన్‌ (ఫైల్‌)

నవాబుపేట: మండలంలోని కొల్లూర్‌ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్‌ పార్టీ మండల సోషల్‌ మీడియా ఇన్‌చార్జ్‌ పిట్టల నిరంజన్‌ (33) శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఘటన వివరాలు.. కొల్లూర్‌కు చెందిన పిట్టల నిరంజన్‌ ఈ నెల 20న రాత్రి కొల్లూర్‌ నుంచి తన అత్తగారి గ్రామం నవాబుపేటకు ద్విచక్రవాహనంపై వస్తుండగా చౌడూర్‌ గేట్‌ సమీపంలో ప్రమాదవశాత్తు బైక్‌ అదుపుతప్పి కిందపడింది. దీంతో తీవ్రగాయాలతో ఉన్న బాధితుడి చుట్టుపక్కల వారు మహబూబ్‌నగర్‌ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తల్లిదండ్రులకు సమాచారం అందడంతో వారు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లగా.. అక్కడే చికిత్స పొందుతూ శుక్రవారం నిరంజన్‌ మృతి చెందాడు. ఘటనపై మృతుడి తల్లి సత్యమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్‌ తెలిపారు.

మాజీ మంత్రి పరామర్శ

బీఆర్‌ఎస్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి మృతుడు నిరంజన్‌ కుటుంబానికి సానుభూతి ప్రకటించారు. అనంతరం గ్రామస్తులు, వివిధ పార్టీల నాయకులు, బంధువుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు రవీందర్‌రెడ్డి, నర్సింహులు, ప్రతాప్‌, లక్ష్మయ్య, రఘు, చందర్‌నాయక్‌, రఘుగౌడ్‌ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

బల్మూర్‌: గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో రోడ్డుపై వెళ్తున్న ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం రాత్రి మండలంలోని నాగర్‌కర్నూల్‌–అచ్చంపేట రహదారిలోని మహాదేవ్‌పూర్‌ స్టేజీ వద్ద చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి ఎస్‌ఐ రమాదేవి తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని మంగళ కుంటపల్లికి చెందిన బొల్లం రవి (36) మహాదేవ్‌పూర్‌ గ్రామంలోని బంధువుల ఇంటి నుంచి స్వగ్రామానికి వెళ్లేందుకు రోడ్డుపై నడిచి వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో క్షతగాత్రుడని 108 అంబులెన్స్‌లో అచ్చంపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఘటనపై శుక్రవారం మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించినట్లు పేర్కొన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి..

జడ్చర్ల: కావేరమ్మపేటలోని రాజీవ్‌నగర్‌ కాలనీకి చెందిన మీసుగ కోటయ్య(50) గురువారం అర్ధరాత్రి అనుమానస్పద స్థితిలో మరణించాడని కుటుంబ సభ్యులు మీసుగ నాగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చంద్రమోహన్‌ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. మీసుగ కోటయ్య గురువారం తమ కులస్తులతో కలిసి షాద్‌నగర్‌లోని ఓ ఫంక్షన్‌కు వెళ్లి అర్ధరాత్రి సమయంలో ఇంటికి వచ్చి నిద్రించాడు. అనంతరం ఆయనలో ఎలాంటి చలనం లేకపోవడంతో గమనించిన భార్య, పిల్లలు వెంటనే చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే చనిపోయినట్లు డాక్టర్లు ధ్రువీకరించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- మూడు తులాల బంగారు, నగదు అపహరణ

కొత్తకోట రూరల్‌: తాళం వేసిన ఉన్న ఇంటి తాళం పగులగొట్టి బంగారు ఆభరణాలు, నగదు చోరీ జరిగిన ఘటన శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆనంద్‌ తెలిపిన వివరాలు.. కొత్తకోటలోని విద్యానగర్‌లో నివాసం ఉంటున్న అస్కని కృష్ణయ్య భార్య అస్కని భాగ్యమ్మ, కుమారుడు హరీష్‌సాగర్‌ శుక్రవారం తెల్లవారుజామున అలంపూర్‌ జోగుళాంబ ఆలయానికి దైవదర్శనం కోసం వెళ్లారు. కృష్ణయ్య ఒక్కడు ఇంటి దగ్గరే ఉన్నాడు. కృష్ణయ్య ఉదయం 10:30గంటలకు కొత్తకోట శివారులోని వ్యవసాయ పొలానికి వెళ్లాడు. తిరిగి మధ్యాహ్నం 1గంట సమయంలో ఇంటికొచ్చి చూడగా తాళం పగలగొట్టి ఉండగా ఆందోళన చెందాడు. లోపలికి వెళ్లి చూడగా బీరువా తాళం పగలగొట్టి అందులో ఉన్న మూడు తులాల బంగారు ఆభరణాలు, కొంత నగదును దొంగలు దోచుకెళ్లినట్లు గుర్తించాడు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లినప్పుడు పక్కింటి వారికి చెప్పి వెళ్లాలని, గుర్తుతెలియని వ్యక్తులు కాలనీల్లో తిరుగుతున్నట్లు కనిపిస్తే పోలీసులకు సమాచారమివ్వాలని ఎస్‌ఐ పట్టణవాసులకు సూచించారు.

ఆపద్బాంధవా.. ఆంజనేయా


విద్యుద్దీపాల వెలుగులో ఆలయం

నేటి నుంచి ఊర్కొండపేట అభయాంజనేయుడి ఉత్సవాలు

- ఏర్పాటు పూర్తిచేసిన అధికారులు
- భక్తుల సౌకర్యార్థం వసతుల కల్పన

ఊర్కొండ: ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. కొండల నడుమ స్వామివారు కొలువు దీరారని చరిత్ర చెబుతుండగా.. ఆలయానికి తూర్పుదిక్కున ఉన్న గుండంలో స్నానమాచరిస్తే కష్టాలు తొలగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఉత్సవాలకు ఉమ్మడి జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల భక్తులు భారీగా తరలిరానున్నారు.

సింధూరం లేని స్వామివారు..

ఇక్కడి ఆలయంలో స్వామివారి మూల విగ్రహానికి సింధూరం ఉండదు. తైల వర్ణంలో భారీ విగ్రహం ఉండగా.. అందుకు తగ్గట్టుగానే గర్భాలయం సైతం ఎత్తుగా ఉంటుంది. నువ్వుల నూనెతో అభిషేకం స్వామి వారికి ఇష్టమని భక్తులు పోటీపడి సమర్పిస్తుంటారు. అదేవిధంగా ప్రతి మంగళ, శనివారం ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతాలు, అర్చనలు, అభిషేకాలు పెద్దసంఖ్యలో భక్తులు నిర్వహిస్తారు. ప్రతి శనివారం రాత్రి స్వామివారి పల్లకీ సేవ, 108 తమలపాకులు, జిల్లెడు పూలతో పూజిస్తారు. 90 ఏళ్ల నాటి ఇనుప రథంపై స్వామివారిని ఊరేగించడం బ్రహ్మోత్సవాల ప్రత్యేకత. శనివారం నుంచి జరిగే ఉత్సవాలకు భక్తులు భారీగా తరలిరానుండటంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని సౌకర్యాలు కల్పించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా, ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ఆలయ ప్రాంగణంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.


అభయాంజనేయుడి మూల విగ్రహం

ఇవీ కార్యక్రమాలు..

శనివారం ఉదయం 8 గంటలకు అర్చకుడు చిరువెల్లి కృష్ణమూర్తి ఇంటి నుంచి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఆలయానికి తీసుకురావడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అనంతరం ధ్వజారోహణం, మూల విగ్రహానికి పంచామృత అభిషేకం, నూతన వస్త్రాలు, వెండి ఆభరణాలు అలంకరించి సహస్ర నామార్చన చేస్తారు.

- 26న ఆదివారం సహస్ర నామార్చన, గజవాహన సేవ, భజనలు, ప్రదోషకాల పూజలు
- 27న ఉదయం ప్రత్యేక పూజలు, రథోత్సవం, పంచసూక్తుల పూజలు
- 28న మాన్యసూక్తులతో అష్టోత్తర నామావళి, మంగళహారతి, రాత్రి పల్లకీసేవ
- 29న ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకం, అష్టోత్తర పూజలు, రాత్రి ఒంటె వాహన సేవ
- 30న అభిషేకం, అర్చనలు, రాత్రి మయూర వాహనసేవ, గ్రామ భజన మండలి భజన కార్యక్రమాలు
- 31న అభిషేకం, అర్చనలు, మంగళహారతి రాత్రికి పల్లకీ సేవ

ఫిబ్రవరి 1 ఉదయం 11 గంటలకు చక్రతీర్థం, అభిషేకం, మంత్ర పుష్పం, సాయంత్రం 6 గంటలకు ఉత్సవ విగ్రహాలు ఆలయ అర్చకుడి గృహానికి భజనలు, మంగళహారతులతో చేరుస్తారు.

ఏర్పాట్లు పూర్తి..



అభయాంజనేయుడి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. నిబంధనలు పాటిస్తూ స్వామివారి దర్శనానికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. ప్రజలు అధికసంఖ్యలో స్వామి వారి సేవలో పాల్గొనాలి. – సత్యచంద్రారెడ్డి, ఈఓ

అందరి సహకారంతోనే..



ఉత్సవాల నిర్వహణకు ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. వివిధ ప్రాంతాల భక్తులు భారీగా తరలిరానున్నందున సరిపడా సౌకర్యాలు కల్పించాం. దేవాలయాన్ని అందరి సహకారంతో అభివృద్ధి చేస్తాం. – నారెడ్డి సత్యనారాయణరెడ్డి, ఆలయ చైర్మన్‌

ఉత్సాహంగా.. పాలిటెక్నిక్‌ క్రీడలు

- 420 మంది బాలబాలికలు హాజరు
- ప్రారంభించిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న మహబూబ్‌నగర్‌ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి


వాలీబాల్‌ ఆడుతున్న క్రీడాకారులు

మహబూబ్‌నగర్‌ క్రీడలు: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాల మైదానంలో రెండు రోజులపాటు జరగనున్న ఉమ్మడి జిల్లాస్థాయి పాలిటెక్నిక్‌ క్రీడా పోటీలను శుక్రవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు మానసిక వికాసానికి దోహదపడుతాయని అన్నారు. పాలిటెక్నిక్‌ కళాశాలలో ఉన్న ఎన్‌సీసీ యూనిట్‌ రాష్ట్రస్థాయి శిక్షణ ఏర్పాటు కోసం నిధులు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాల అప్‌గ్రేడ్‌ చేసుకోవడం ఎంతైనా అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ జి.మోహన్‌బాబు, డీటీఓ శ్రీనివాస్‌, పీడీ ఎ.శ్రీకాంత్‌, హెచ్‌ఓడీలు అప్పారావు, కె.వీరస్వామి, రాజేశ్వరి, సత్యనారాయణ, ప్రవీణ, జువేరియా జరీన్‌ పాల్గొన్నారు.

మొదటి రోజు పాలిటెక్నిక్‌ క్రీడల ఫలితాలు

ఉమ్మడి జిల్లా పాలిటెక్నిక్‌ క్రీడా పోటీల్లో మహబూబ్‌నగర్‌. గద్వాల, వడ్డెపల్లి, కోస్గి, వనపర్తి, పెబ్బేర్‌ ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాలలు, జేపీఎన్‌సీఈ కళాశాల నుంచి 300 మంది బాలురు, 120 మంది బాలికలు హాజరయ్యారు. వీరికి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌, బ్యాడ్మింటన్‌, టేబుల్‌ టెన్నిస్‌, చెస్‌, అథ్లెటిక్స్‌ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. ఖోఖో బాలికల విన్నర్‌గా మహబూబ్‌నగర్‌ ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాల, పెబ్బేర్‌ రన్నరప్‌గా, బాలుర వాలీబాల్‌లో మహబూబ్‌నగర్‌ ప్రథమ, గద్వాల ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. అథ్లెటిక్స్‌ బాలుర లాంగ్‌జంప్‌లో ఎం.మల్లేష్‌ (వడ్డెపల్లి) ప్రథమ, మురళీకృష్ణ (మహబూబ్‌నగర్‌) ద్వితీయ, ట్రిపుల్‌ జంప్‌లో మురళీకృష్ణ (మహబూబ్‌నగర్‌) ప్రథమ, పి.శివకుమార్‌ (మహబూబ్‌నగర్‌) ద్వితీయ, హైజంప్‌లో జి.సిద్దార్థ (కోస్గి) ప్రథమ, ఈశ్వర్‌ (గద్వాల) ద్వితీయ, బ్యాడ్మింటన్‌ బాలికల్లో సింగిల్స్‌లో అశ్విని (మహబూబ్‌నగర్‌) ప్రథమ, కె.కావ్యశ్రీ (పెబ్బేర్‌) ద్వితీయ, డబుల్స్‌లో గౌరిప్రియ, అనూష (వనపర్తి) ప్రథమ, జి.పూజిత, కె.ఇందు (పెబ్బేర్‌) ద్వితీయ స్థానాల్లో నిలిచారు.

రోడ్డెక్కిన రైతన్నలు


హైదరాబాద్‌ రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న రైతులు

- వేరుశనగకు గిట్టుబాటు ధర ఇవ్వాలని డిమాండ్‌
- హైదరాబాద్‌ రోడ్డుపై రాస్తారోకో
- నచ్చజెప్పిన మార్కెట్‌ చైర్మన్‌, సిబ్బంది
- ఆందోళన విరమించిన అన్నదాతలు

కల్వకుర్తి రూరల్‌: ఆరుగాలం శ్రమించి పండించిన వేరుశనగకు గిట్టుబాటు ధర లభించడం లేదని రైతులు రోడ్డెక్కారు. శుక్రవారం కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌కు 99మంది రైతులు 108 క్వింటాళ్ల వేరుశనగ పంటను అమ్మకానికి తెచ్చారు. పంటకు డిమాండ్‌ లేకపోవడంతో వ్యాపారులు టెండర్‌ వేసేందుకు వెనుకంజ వేశారు. కొద్దిమంది మాత్రమే టెండర్‌ ప్రక్రియలో పాల్గొన్నట్లు రైతులు ఆరోపించారు. అత్యధికంగా రూ.6,430 ధర లభించగా, కనిష్టంగా 4,810 ధర లభించింది. దీంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎకరాకు వేలాది రూపాయలు ఖర్చు చేశామని, ప్రస్తుతం లభించిన ధర తమ ఖర్చులకు కూడా సరిపోవటం లేదని ఆవేదన చెందారు. వేరుశనగకు గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలని మార్కెట్‌ కార్యాలయంలో ఆందోళన చేశారు. వేరుశనగకు రూ.7వేల పైన చెల్లించాలని రైతులు డిమాండ్‌ చేశారు. తమకు గిట్టుబాటు ధర కావాలని హైదరాబాద్‌ రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. రైతుల ఆందోళన విషయాన్ని తెలుసుకున్న పోలీసులు వెంటనే హైదరాబాద్‌ చౌరస్తాకు చేరుకొని రైతులకు నచ్చచెప్పారు. మార్కెట్‌ చైర్మన్‌ సంజీవ్‌, మార్కెట్‌ సిబ్బంది రైతులతో మాట్లాడి మార్కెట్‌ కార్యాలయంలోకి తీసుకెళ్లారు. కొద్దిసేపు రైతులతో చర్చించారు. అనంతరం ఈరోజు నిర్వహించిన టెండర్లను రద్దుచేస్తూ నిర్ణయం తీసుకోవడంతో పాటు శనివారం టెండర్‌ ప్రక్రియ మరోసారి నిర్వహిస్తామని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. ఏది ఏమైనా వేరుశనగ రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని పలువురు డిమాండ్‌ చేస్తున్నారు.

వ్యక్తికి ఆరేళ్ల జైలుశిక్ష

- డీఎస్పీ లింగయ్య

మరికల్‌: ఓ వ్యక్తిపై నేరం రుజుం కావడంతో అతడికి ఆరేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.60వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్‌ అబ్దుల్‌ రఫీ తీర్పు ఇచ్చినట్లు డీఎస్పీ లింగయ్య తెలిపారు. వివరాలు.. మహబూబ్‌నగర్‌ జిల్లా చిన్నచింతకుంట మండలం దామగ్నపూర్‌కు చెందిన పురుషోత్తంరెడ్డి(18) నారాయణపేట జిల్లా మరికల్‌ మండలం జిన్నారంలో ఉంటున్న వాళ్ల అక్క, బావ దగ్గర ఉండేవాడు. 2021 జూన్‌ 29న తెల్లావారుజామున రవీందర్‌రెడ్డి అనే వ్యక్తికి చెందిన పొలంలో పందుల బెడద కోసం పెట్టిన కరెంట్‌ తీగ తగిలి పురుషోత్తం రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో మృతుడి తండ్రి పాకనాటి బుచ్చిరెడ్డి రవీందర్‌రెడ్డిపై కఠినచర్యలు తీసుకోవాలని మరికల్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్‌ఐ మొహమ్మద్‌నాసర్‌ కేసు నమోదు చేసుకోగా, అప్పటి సీఐ శివకుమార్‌తో కలిసి విచారణ చేపట్టి కోర్టులో చార్జిషీట్‌ వేశారు. కేసు చివరి దశకు రావడంతో ప్రస్తుత సీఐ రాజేందర్‌ రెడ్డి, ఎస్‌ఐ రాము, కోర్టు లైజనింగ్‌ ఆఫీసర్‌ ఏఎస్‌ఐ కృష్ణయగౌడ్‌, కోర్టు డ్యూటీ ఆఫీసర్లు హన్మంతు, శ్రీధర్‌ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు. పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ ఆకుల బాలప్ప కోర్టులో వాదనలు వినిపించగా నేరం నిరూపణ అయింది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిందితుడైన రవీందర్‌రెడ్డికి ఆరేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.60 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసుల్లో నేరస్తుడికి శిక్ష పడటానికి కృషిచేసిన పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌, కోర్టు డ్యూటీ పోలీసులను డీఎస్పీ అభినందించారు.

జిల్లా జైలును సందర్శించిన గ్లోబల్‌ ఫండ్‌ బృందం

మహబూబ్‌నగర్‌ క్రైం: మహబూబ్‌నగర్‌లోని జిల్లా జైలును శుక్రవారం గ్లోబల్‌ ఫండ్‌ విదేశీ బృందం స్విట్జర్లాండ్‌ నుంచి జులియా, ఫ్రాన్స్‌ నుంచి జెస్సికా, రాష్ట్ర ఎయిడ్స్‌ కంట్రోల్‌ సొసైటీ జేడీ శ్రీప్రసాద్‌ సందర్శించారు. ఖైదీలతో మాట్లాడి హెచ్‌ఐవీ స్క్రీనింగ్‌, టీబీ, సుఖవ్యాధులు, కామెర్లకు సంబంధించిన వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. జైలు సూపరింటెండెంట్‌ వెంకటేశంతో పాటు జైలు వైద్యుడు శ్రీకాంత్‌తో ఖైదీల ఆరోగ్య సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డా. కృష్ణ, లక్ష్మీరామకృష్ణ, ముఖేష్‌, ఓం ప్రకాష్‌, వినోద్‌, అశోక్‌, శేషాద్రి, మురళిబాబు, శ్రీశైలం పాల్గొన్నారు.


జిల్లా జైలు ఎదుట గ్లోబల్‌ ఫండ్‌ బృందం

గంగాపురం జాతరకు ఏర్పాట్లు చేయాలి

- కోఆర్డినేషన్‌ కమిటీ సమావేశంలో ఆర్డీఓ నవీన్‌


సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీఓ నవీన్‌

జడ్చర్ల టౌన్‌: గంగాపుర లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈనెల 30 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని మహబూబ్‌నగర్‌ ఆర్డీఓ నవీన్‌ ఆయా శాఖల అధికారులు, సిబ్బందికి సూచించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్‌ కార్యాలయంలో బ్రహ్మోత్సవాలపై నిర్వహించిన కోఆర్డినేషన్‌ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్యం, విద్యుత్‌, తాగునీరు, శాంతిభద్రతల సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. ఆలయం లోపల, వెలుపల సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయంలో 32 సీసీ కెమెరాలు ఉన్నాయని ఈఓ దీప్తిరెడ్డి ఆర్డీఓకు తెలియజేశారు. గ్రామంలో అవసరమైన చోట సీసీ కెమెరాల ఏర్పాట్లు చేస్తామని సీఐ ఆదిరెడ్డి తెలిపారు. తాగునీటి ఎద్దడి రాకుండా ఆర్‌డబ్ల్యూఎస్‌, మిషన్‌భగీరథ శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాల పార్కింగ్‌కు అవసరమైన స్థలం కేటాయించాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 24గంటల పాటు మూడు విడతలుగా శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించి పారిశుద్ధ్యం, ఉత్సవ నిర్వహణకు గ్రామ పంచాయతీలో నిధులు లేవని, మంజూరు చేయాలని కార్యదర్శి శ్రీనివాసులు ఆర్డీఓను కోరారు. అందుకు అవసరమైన బడ్జెట్‌ ప్రతిపాదనలు పంపితే జనరల్‌ ఫండ్‌ ద్వారా ఖర్చు చేసుకునే అవకాశం ఇస్తామని ఆర్డీఓ తెలిపారు. సమావేశం అనంతరం ఆయన గంగాపురం ఆలయం సందర్శించి అక్కడ వసతులు, ఏర్పాట్లను పరిశీలించారు. కాగా ఆలయంలో రూ.40లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆలయ ట్రస్ట్‌ సభ్యుడు జనార్దన్‌రెడ్డి ఆర్డీఓకు వివరించారు. సమావేశంలో సీఐ ఆదిరెడ్డి, తహసీల్దార్‌ బ్రహ్మంగౌడ్‌, ఎంపీడీఓ విజయ్‌కుమార్‌, ఆర్టీసీ డీఎం సుజాత, మిషన్‌భగీరథ అధికారులు మొగులాల్‌, ఎంపీఓ సుజాత, ఆలయ ఈఓ దీప్తిరెడ్డి, ట్రస్ట్‌ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీలో విజేతగా నిలవాలి


ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారులతో కబడ్డీ సంఘం ప్రతినిధులు

మహబూబ్‌నగర్‌ క్రీడలు: రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీలో జిల్లా జట్టు మెరుగైన ప్రతిభ కనబరిచి విజేతగా నిలవాలని జిల్లా కబడ్డీ సంఘం కార్యదర్శి కురుమూర్తిగౌడ్‌ అన్నారు. జిల్లాకేంద్రంలోని మెయిన్‌ స్టేడియంలో శుక్రవారం జిల్లా పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్‌లో వచ్చేనెల 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకు రాష్ట్రస్థాయి సీనియర్‌ పురుషుల కబడ్డీ టోర్నమెంట్‌ ఉంటుందని తెలిపారు. ఎంపికలకు జిల్లావ్యాప్తంగా 67 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు చెప్పారు. వీరిలో 12 మంది, ఇద్దరు స్టాండ్‌ బైలుగా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. వీరికి మెయిన్‌ స్టేడియంలో ప్రత్యేక కోచింగ్‌ క్యాంప్‌ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్‌ క్రీడాకారులు ముత్యం గురుస్వామి, రాంచంద్రయ్య, జిల్లా కబడ్డీ సంఘం ఉపాధ్యక్షులు దామోదర్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులు బాల్‌రాజు, పాపారాయుడు, కె.నర్సింలుతో పాటు గణేష్‌, ఆర్‌.శ్రీనివాసులు, యూ.శ్రీనివాసులు, పురుషోత్తం పాల్గొన్నారు.

సైబర్‌ కేటుగాడు దొరికాడు

- రమేష్‌నాయక్‌ను అరెస్ట్‌చేసిన పోలీసులు
- రూ.80లక్షలు ఆస్తులు, కియా కారు స్వాధీనం
- సైబర్‌ క్రైం డీఎస్పీ ఎన్‌జీ రత్నం


వివరాలు వెల్లడిస్తున్న సైబర్‌ క్రైం డీఎస్పీ ఎన్‌బీ రత్నం

వనపర్తి: ఉమ్మడి జిల్లాలోని తండాల్లో, గ్రామాల్లో యువతను సైబర్‌ నేరాలపై మళ్లించి వారి బంగారు భవిష్యత్‌ను ఆగం చేస్తున్న సైబర్‌ కేటుగాడు ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. సైబర్‌ నేరాల ప్రధాన నిందితుడు రమేష్‌ నాయక్‌ అలియాస్‌ లడ్డు రమేష్‌ను శుక్రవారం పోలీసులు అరెస్ట్‌ చేశారు. పట్టణంలోని సీఐ కార్యాలయంలో సైబర్‌ క్రైం డీఎస్పీ ఎన్‌బీ రత్నం, సీఐ క్రిష్ణ తెలిపిన వివరాలు.. గత నాలుగేళ్ల నుంచి రెండు రాష్ట్రాలకు చెందిన అమాయక ప్రజలను సైబర్‌ నేరాల ద్వారా దోచుకుంటున్న 29మంది సైబర్‌ నేరగాళ్లను అరెస్ట్‌ చేసి జైలుకు పంపినట్లు తెలిపారు. రమేష్‌నాయక్‌ పలు తండాల్లోని యువతను డబ్బు ఆశచూపి ఢిల్లీ, కోల్‌కత్తా, పాట్నాలకు పంపి వారికి శిక్షణ ఇచ్చి వారితో సైబర్‌ నేరాలకు పాల్పడేవాడు. వారు వసూలుచేసిన డబ్బుల్లో నుంచి వారి వాటా కింద 30శాతం డబ్బులు ఇప్పించేవాడు. ఆ విధంగా నిందితుడు ఇప్పటివరకు సుమారు రూ.కోటి కంటే ఎక్కువగానే సంపాదించాడు. ఈ క్రమంలో నేరస్తుడికి సహకరించిన అతని అన్న చంద్రశేఖర్‌, తల్లి గోపమ్మలపై సైతం కేసు నమోదు చేశారు. నిందితుడి నుంచి రూ.45లక్షలతో కట్టిన ఇల్లు, సుమారు రూ.24లక్షల విలువ చేసే రెండు ఇంటి ప్లాట్లు, రూ.12.50లక్షల విలువ గల కియా కారు, నాలుగు మొబైల్‌ ఫోన్లు స్వాధీనం చేసుకొని కోర్టులో సమర్పించినట్లు సైబర్‌ క్రైం డీఎస్పీ తెలిపారు.

డిండికి నీటి తరలింపుపై పోరాడుదాం

- పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్‌ రాఘవాచారి

పాలమూరు: ఉమ్మడి పాలమూరు రైతులు పాలమూరు నుంచి డిండికి నీటి తరలింపుపై పోరాడుదామని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్‌ రాఘవాచారి పిలుపునిచ్చారు. స్థానికంగా శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి పాలమూరుకు చెందిన రాజకీయ పార్టీ నేతల బానిస స్వభావంతో మనకు దక్కాల్సిన సాగునీటిని నల్లగొండకు తరలించుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్లుగా చేసిన పోరాటంలో ఉద్యమకారులతో కలిసి నడిచిన కాంగ్రెస్‌ పార్టీయే నీరు తరలించుకుపోవడానికి జీఓ ఇచ్చిందన్నారు. పనులు పూర్తి చేయడానికి నిధులు కేటాయించిందని, ఇలాంటి అన్యాయమైన ఉత్తర్వులను ప్రతిపక్షాలు ఆపలేకపోయాయని, వీరు ఎవరికోసం పనిచేస్తున్నారో తెలియడం లేదన్నారు. కృష్ణా నదిలో ఉన్న తెలంగాణ నీరు మొత్తం నల్లగొండ జిల్లాకు వాడుతున్నారని, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నల్లగొండ జిల్లాకు మాత్రమే మంత్రిగా ఉన్నారా అని ప్రశ్నించారు. డిండికి నీరు తరలించే ప్రతిపాదన రద్దు చేసే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో షాపు దగ్ధం


మంటల్లో పూర్తిగా కాలిపోయిన దుకాణం

కల్వకుర్తి టౌన్‌: షార్ట్‌ సర్క్యూట్‌తో వన్‌గ్రామ్‌ గోల్డ్‌ దుకాణంలో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైన ఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ హన్మంత్‌రెడ్డి వివరాలు.. పట్టణంలోని బస్టాండ్‌ సమీపంలో ఉన్న నేషనల్‌ టాకీస్‌ వెనక భాగంలో ఉన్న సిరి వన్‌గ్రామ్‌ గోల్డ్‌ దుకాణంలో షార్టుసర్క్యూట్‌తో గురువారం అర్ధరాత్రి మంటలు చెలరేగాయి. మంటలను గుర్తించిన స్థానికులు షాపు యజమాని మల్లేష్‌కు సమాచారం ఇచ్చారు. అతను దుకాణం వద్దకు వచ్చి అగ్నిమాపక సిబ్బందికి సమాచారమివ్వగా ఫైరింజన్‌ అక్కడికి చేరుకొని మంటలను ఆర్పింది. రూ.లక్ష ఆస్తినష్టం జరిగిందని, ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

మెట్టుగడ్డతండాలో కందిపంట..

నవాబుపేట: విద్యుత్‌ వైర్లు తెగిపడి కంది పంట దగ్ధమైన ఘటన మండలంలోని మెట్టుగడ్డతండాలో శుక్రవారం చోటు చేసుకుంది. తండాకు చెందిన బాబునాయక్‌కు చెందిన ఎకరన్నర కంది పంట కోతకు వచ్చింది. రెండు రోజుల్లో కోతలు చేద్దామని అనుకుంటుండగా శుక్రవారం పంటపై నుంచి వెళ్తున్న కరెంటు వైర్లు ఉన్నట్టుండి తెగిపంటపై పడడంతో నిప్పంటుకుని కందిపంట మొత్తం దగ్ధమైంది. ఈ ఘటనలో దాదాపుగా రూ.60 వేలకు పైగా విలువ గల కంది పంట నష్టపోయినట్లు రైతు వాపోయాడు. బాధిత రైతును ఆదుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.